క్లుప్తంగా

వాహనాల తనిఖీ



మరికల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మరికల్‌లోని సబ్‌స్టేషన్ దగ్గర బుధవారం పోలీసులు వాహనలను తనిఖీలు చేపట్టారు. సబ్‌స్టేషన్ చౌరస్తాలో బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెలల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున్న ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలించాలని చూస్తే సీజ్ చేస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల వరకు తనిఖీలు కొనసాగుతయన్నారు.

సన్మానం



మాగనూర్: మండల పరిధిలోని వద్వాట్ గ్రామానికి చెందిన రాకేష్‌రెడ్డి అగ్నివీర్‌కు ఎంపికవ్వడంతో బుధవారం మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అభినందించారు. యువకుడిని, అతడి తల్లిదండ్రులను ఘనంగా పూలమాల, శాలువలతో సన్మానించారు. మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, జడ్పీటీసీ వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఐకేపీ ఏపీఎంకు..

మద్దూరు: మద్దూరు మండలంలో మహిళ సమాఖ్యలో 9 ఏళ్లపాటు సుదీర్ఘంగా పనిచేసిన ఏపీఎం పీ గోపాల్‌ను సమాఖ్య కార్యవర్గ సభ్యులు, వీఓఏలు, ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే మక్తల్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన నారాయణను సన్మానించారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శికి..



మద్దూరు: నారాయణపేట జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనా కల్లపు దినేష్‌ను బుధవారం మండల కేంద్రంలో వీరశైవ లింగాయత్ ఉమ్మడి మహబూబ్‌నగర్ కమిటీ సభ్యులు సన్మానించారు. నాయకుడు శివరాజ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారాయణం



నారాయణపేట రూరల్ : పట్టణంలోని జీపీ శెట్టి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న సుందరకాండ పారాయణం కొనసాగుతోంది. మూడవరోజు బుధవారం సాయంత్రం ఆధ్యాత్మిక వేత్త, హనుమత్ ఉపాసకులు డాక్టర్ వీ.శ్రీనివాస్‌రావు రామాయణ విశిష్టత, సుందరకాండలోని వివిధ ఘట్టాలను వివరించారు. ప్రతి ఒక్కరికి కర్మలను అనుసరించి మంచి, చెడు తిరిగి వారికి తప్పకుండా చేరుతాయని, శత్రువుని మిత్రుడిగా మార్చే శక్తి రామనామానికి ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి వార్డు కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

అమరచింత: ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా కోరారు. పట్టణంలోని పదో వార్డులో బుధవారం ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీల్లో అమరచింత మున్సిపాలిటీ ఇంటి పన్నుల వసూళ్లలో రెండో స్థానంలో ఉందన్నారు. మొదటి స్థానంలో పెబ్బేరు, మూడవ స్థానంలో కొత్తకోట, నాల్గవ స్థానంలో ఆత్మకూర్, ఐదో స్థానంలో వనపర్తి ఉందన్నారు. ఇంటి పన్నుల వసూళ్ల ఆధారంగానే పట్టణంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. వీటితో పాటు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి ప్రతి నెల వేతనాలు చెల్లించే అవకాశం కలుగుతుందన్నారు. గతంలో పన్నులు చెల్లించకుండా మొండి బకాయిదారులుగా ఉన్నవారి వివరాలను సేకరించి వారికి ప్రభుత్వం నుంచి రావల్సిన పథకాలను నిలిపేయడానకి ప్రణాళిక రూపొందించామని తెలపాన్నారు. పట్టణంలో మురుగుకాల్వల శుభ్రతతో పాటు వీధులు, రహదారుల శుభ్రతకు విఘాతం కలుగకుండా ప్రతి ఒక్కరూ ఇంటి బకాయిలను చెల్లిస్తేనే సకాలంలో నిర్వహించే అవకాశం ఉందన్నారు. పట్టణంలోని పది వార్డుల్లో ఇంటి పన్నుల వసూళ్ల కోసం మూడు బృందాలను నియమించి శ్రద్ధ చూపుతున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, ఆర్‌ఐ క్రిష్టయ్య, ప్రభాకర్, హరికృష్ణ పాల్గొన్నారు.

మరికల్ బస్టాండ్‌కు మహర్దశ!

- రూ. 1.20 కోట్ల నిధులు మంజూరు
- బస్టాండ్ ను పరిశీలించిన ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి



బస్టాండ్ ఆధునికీకరణపై సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

మరికల్: మరికల్ ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు మారనున్నాయి. 35 ఏళ్ల తర్వాత మహర్దశ రానుంది. గతేడాది జరిగిన అసెంబ్లీ సమావేశంలో బస్టాండ్ మరమ్మతుల విషయంపై ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సభలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కృషి ఫలించడంతో బస్టాండ్ ఆధునికీకరణకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు సీడీపీ నిధుల కింద రూ. 1.20 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఇంజనీర్లతో కలిసి బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంజూరైన నిధులతో బస్టాండ్ ప్రాంగణంలోకి వర్షపునీరు నిలవకుండా పక్కాగా డ్రైయినేజీ వ్యవస్థ, సీసీరోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం నాణ్యమైన పర్నీచర్, నీటి వసతి, ప్లాట్‌ఫామ్ విస్తరణ, క్యాంటీన్ ఆధునీకరణ చేపట్టాలన్నారు. ఇంజనీర్లకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. అవసరమైతే మరో రూ. 15 లక్షలను మంజూరు చేస్తామని అన్నారు.

జిల్లా ముఖద్వారం

కొత్తగా ఏర్పాటైన నారాయణపేట జిల్లాకు మరికల్ ముఖద్వారం అని చెప్పుకోవచ్చు. మరికల్ మీదుగా గుల్బర్గా, నారాయణపేట, మక్తల్, రాయిచూర్, గద్వాల్, హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, గుంటూరు, గోవా తదితర పట్టణాలకు నిత్యం ప్రయాణికులు బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. 35 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం మరమ్మతులకు నిధులు మంజూరు కావడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీ నాయకులపై ఎమ్మెల్యే గుస్సా!

మరికల్: ఇటీవల మండల కేంద్రంలోని అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం సర్పంచ్ తీరు నచ్చక ఉపసర్పంచ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు తమ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే, ఈ విషయం ఎమ్మెల్యేకు తెలియడంతో ఇందుకు సంబంధించిన ప్రజాప్రతినిధిని తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. బుధవారం మరికల్ బస్టాండ్‌ను పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యేతో పలువురు స్థానిక నాయకులు ఏదో చెప్పబోగా తనకు అన్ని తెలుసని ఏమీ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అభివృద్ధి విషయంలో సహకారం లేకపోవడంతో ఆయన ఆగ్రహంగా ఉన్నట్లు పలువురు మాట్లాడుకున్నారు.

మార్నింగ్‌వాక్..

దామరగిద్ద: ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి సమస్యలను తెలుసుకునేందుకు చేపట్టిన మార్నింగ్ వాక్‌లో భాగంగా బుధవారం పట్టణంలో కనిపించిన నాయకులను ఆత్మీయంగా పలకరించారు. శాసన్‌పల్లి రూట్‌లో వెళుతుండగా ఎదురుపడ్డా బీఆర్‌ఎస్ నాయకుడు బాపన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్‌ను చూసి బాగున్నావా అంటూ ఆత్మీయంగా పలకరించారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుపై వేసిన కేసు, లబ్ధిదారులకు చెల్లించాల్సిన అభయ హస్తం డబ్బుల పంపిణీ తదితర విషయాల్లో కృషిచేయాడాన్ని అభినందించారు.

'పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి'



పాఠశాలకు టీవీ వితరణ చేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మాగనూర్: పల్లె పల్లెకు వీజేఆర్ కార్యక్రమంలో భాగంగా ఆ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని మందిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా రూ. 40 వేలు విలువ చేసే కలర్ టీవీని వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతుల కల్పనకు తమ వంతుగా కృషిచేస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిమ్మన్న మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి వీజేఆర్ ఫౌండేషన్ ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఇలాంటి సేవలు కొనసాగించాలని కోరారు. అనంతరం జగన్నాథ్‌రెడ్డిని గ్రామస్తులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ రాఘవేంద్ర, గ్రామస్తులు అశోక్, వెంకటేష్, ఆశప్ప, నర్సప్ప, అంజనేయులు, మంజు, చంద్రు, పాఠశాల ఉపాధ్యాయులు పరమేశ్వరి, సరిత, రాములు , ఎస్‌ఎంసీ చైర్మన్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో వేధిస్తున్న సమస్యలు



మక్తల్‌లో ప్రహరీ నిర్మాణం లేక పరిస్థితి ఇలా..

మక్తల్: పట్టణ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలను సమస్యలు పీడిస్తున్నాయి. పాఠశాలలో 201 మంది విద్యార్థులు ఉండగా, 13 మంది మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాల ఆవరణలోకి నిత్యం పాములు వస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ అసంపూర్తిగా ఉందని, చెరువు నీరు చుట్టూ ఉండడంతో భవనం తేమగా ఉంటుందని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాధితకుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు: మండల కేంద్రానికి చెందిన యంకాయల్ల అనురాధకు మంజూరైన రూ. 2.5లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అందజేశారు. కొద్దికాలంగా అనురాధ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించడానికి ఆయన కృషిచేశారు. నియోజకవర్గంలో ఎవరు ఇబ్బందుల్లో ఉన్న తనవంతు సహకారం అందిస్తానన్నారు. నాయకులు వీరేష్‌గౌడ్, నర్సింహా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తంటాలు



జిల్లా కేంద్రంలో కొత్తబస్టాండ్ వద్ద నిరుపయోగంగా తాగు నీటి కుళాయి

- నిరుపయోగంగా మినీట్యాంక్‌లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- దృష్టిసారించని అధికారులు

నారాయణపేట టౌన్ : పట్టణం కేంద్రంలో తాగునీటి లభ్యతకు కష్టాలు తప్పడం లేదు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో పరిస్థితి మరింత దారుణంగా తయ్యారయ్యే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. మేలిమి బంగారం, చేనేత వస్త్రాలకు ఎంతో ప్రసిద్ధి అయిన పేటకు జిల్లా వాసులే కాక కర్ణాటక ప్రజలు కూడా నిత్యం అనేక పనుల నిమిత్తం వందల సంఖ్యలో వస్తుంటారు. దీంతో పట్టణం రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆయా చోట్ల కనీస తాగునీటి వసతి లేక ఇక్కడకు వచ్చే ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బస్టాండ్ వంటి ప్రాంతాలలోనూ ఎలాంటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు అంటున్నారు. తప్పనిసరి పరిస్థితులలో వాటర్ ప్యాకెట్స్, బాటిల్స్ కొంటున్నామని చెబుతున్నారు. వాటిని కూడా అదనుచూసి కొందరు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే కూరగాయల మార్కెట్ వంటి రద్దీ ప్రదేశాలలో మినీ ట్యాంకులు ఉన్నా నిరుపయోగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్టాండ్, కూరగాయల మార్కెట్, అంబేద్కర్ చౌరస్తా, సత్యనారాయణ చౌరస్తా, పాతబస్టాండ్, సెంటర్ చౌక్, సుభాష్‌రోడ్ మరికొన్ని ప్రాంతాల్లో తాగునీటి వసతి కల్పించాలని, చలివేంద్రాల వంటివి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



బస్టాండ్‌లో తాగునీటి కోసం ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితిలో డబ్బులు చెల్లించి వాటర్ బాటిల్స్ వంటివి కొంటున్నాం. ఇప్పటికైనా స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకుని, సమస్య పరిష్కరించాలి.

– వెంక్రాములు, కోంకల్, కర్ణాటక

చర్యలు తీసుకుంటాం

తర్వలోనే ప్రధాన కూడళ్ల వద్ద వేసవి కాలం దృష్ట్యా చలివేంద్రాల ఏర్పాటు చేపడతాం. పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తాం. ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



కోస్గి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పనిచేసే ఉపాధ్యాయ సంఘానికి పట్టం కట్టాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని పలు పాఠశాలలతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. గుర్రం చెన్నకేశవరెడ్డికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నాయకులు వార్ల మల్లేశం, రమేష్, మధుసూదన్, భాస్కర్, వెంకట్‌రెడ్డి, అనంతయ్య, వెంకటయ్యతోఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పోరాటాలు కొనసాగిద్దాం'



నారాయణపేట రూరల్ : మండలంలోని అప్పిరెడ్డిపల్లి, కోటకొండ, అభంగాపూర్ గ్రామాల్లో బుధవారం సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేపట్టారు. హాజిమలాంగ్, సలీం, రాములు, ఇస్మాయిల్, హన్మంతు భీమేష్, రమేష్, రహమాన్, పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : ఉద్యమాల నిర్మాణంలో ప్రజాపంథా మార్గంలోనే జనతా ప్రజాతంత్ర విప్లవం సాధ్యమవుతుందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు కాశీనాథ్ అన్నారు. పార్టీ ఆవిర్భా దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. మండల కార్యదర్శి బి.నర్సింహులు, నాయకులు నారాయణ, లాలు ప్రసాద్, సతీష్, రోషన్, నర్సింహులు, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంజి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: శ్రామికులు దోపిడి, పీడిత విముక్తి పోరాటాలను కొనసాగించాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ డివిజనల్ కార్యదర్శి సలీం అన్నారు. బుధవారం మండలంలోని పెద్దపొర్ల, బిజ్వార్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింహులు, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, అజయ్, కిరణ్, ఈశ్వర్ పాల్గొన్నారు.



బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన



నినాదాలు చేస్తున్న నాయకులు

మక్తల్: కట్మోనెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరగలేదని బుధవారం మక్తల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రజాధరణ కలిగిన ఎమ్మెల్యే సాయన్నను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో మక్తల్ ఇన్‌చార్జ్ పాలెం వెంకటయ్య, జిల్లా ఇన్‌చార్జ్ అర్జున్‌రాజ్, నరేందర్, కల్యాణ్‌రాజ్, నాగేష్, బండారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



బహుమతులతో విద్యార్థులు

ఊట్కూరు: రాష్ట్ర విద్యాశాఖ పిలుపు మేరకు నిడుగుర్తి పాఠశాలలో నిర్వహించిన ఇంగ్లీష్ స్పెల్లింగ్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4–8వ తరగతి వరకు విద్యార్థులు ఇంగ్లీష్ పదాలు, వాటి అర్థాలకు సంబంధించి పోటీ పరీక్ష నిర్వహించారన్నారు. అత్యధిక పదాలు రాసిన విద్యార్థిని వైష్ణవికి మొదటి బహుమతి, తర్వాతి స్థానాల్లో నిలిచిన వారికి ద్వితీయ, తృతీయ బహుమతులు అందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పద్మ, వెంకటప్ప, సుజాత, సలాం, లియాకత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

మాగనూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండవ దశ కార్యక్రమం కొనసాగుతోంది. మాగనూర్ మండలం కొత్తపల్లిలో శిబిరం ఏర్పాటు చేయగా స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రజలు వినియోగించుకొంటున్నారని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్‌లు రాఘవేంద్రరెడ్డి, శిరీష, ఏఎన్‌ఎంలు సుధా, రవి, అజయ్, ఆశకార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: పెద్దకడ్మూర్‌లో గ్రామ పంచాయతీ వద్ద మూడురోజులుగా కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోందని ఇన్‌చార్జ్ వైద్యులు వెంకటరమణ తెలిపారు. పరీక్షలు చేసి అవసరమైన వారికి వెంటనే అద్దాలు అందజేస్తున్నట్లు వివరించారు. ప్రజలు శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాస్, టెక్నీషియన్ అబ్దుల్ రహమాన్, సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

లంపీస్కిన్ వైరస్‌తో దూడమృతి

- వైద్యాధికారుల నిర్లక్ష్యమే కారణమన్న రైతు

మరికల్: మండల కేంద్రానికి చెందిన రైతు బోయ పెద్ద నర్సిములుకు చెందిన లేగదూడకు లంపీ స్కిన్ వైరస్ సోకి బుధవారం మృతి చెందింది. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ దూడకు వైరస్ సోకిందని చికిత్స చేయాలని 15 రోజుల నుంచి పలుమార్లు పశువైద్యాధికారిని కోరామన్నారు. అయినా పట్టించుకోలేదని ఆరోపించారు. డాక్టర్ ఒకరోజు కూడా రాకుండా అటెండర్‌ను పంపించి చికిత్సలు చేయించడం వల్ల నాణ్యమైన వైద్యం అందలేదని వాపోయారు. వైద్యాధికారి నిర్లక్ష్యమే దూడమృతికి కారణమని అన్నాడు.

టెన్త్ ఇంటర్నల్ మార్కుల పరిశీలన



మార్కులు వేస్తున్న ఉపాధ్యాయులు



మార్కులు పరిశీలిస్తున్న బృందం

నారాయణపేట రూరల్: విద్యాశాఖ ఏర్పాటు చేసిన సీసీఈ విధానంలో భాగంగా టెన్త్ విద్యార్థులకు పాఠశాలలో నిర్వహించే కృత్యాలకు సంబంధిత సబ్జెక్ట్ టీచర్లు వేసిన ఇంటర్నల్ మార్కుల పరిశీలన కార్యక్రమం.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు ఆ పాఠశాలలో నిర్వహించిన పరీక్షలు, ప్రాజెక్టు ఇతర అంశాలకు సంబంధించి కేటాయించిన 120మార్కులను సరిచూసే ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 126 పాఠశాలలకు గాను 28 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా, వారు బుధవారం రెండు పాఠశాలలను తనిఖీ చేసి మార్కులు సరిచూశారు. మరో రెండురోజుల్లో పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, డీఈఓ కార్యాలయంలో నివేదిక అందిస్తారు. అదేవిధంగా ఆయా పాఠశాలల్లో జరుగుతున్న ప్రిఫైనల్ పరీక్షల నిర్వహణను పరిశీలించి, టెన్త్ విద్యార్థులకు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగార్జున్‌రెడ్డి, నారాయణరెడ్డి, సత్యనారాయణ, శశికుమార్, రవికుమార్, నాజ్మిన్‌బేగమ్ పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని పల్లెర్ల ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు పదోతరగతి ఇంటర్నల్ మార్కులను ఇతర పాఠశాలల సబ్జెక్టు ఉపాధ్యాయులు బుధవారం వేశారు. ఈ పాఠశాలలో పదో తరగతి చదివే 28 మంది విద్యార్థుల నోట్స్, ఇతర ప్రతిభను పరీక్షించి మార్కులు వేశారు. ఈ కార్యక్రమంలో వెరిఫికేషన్ అధికారిగా మోనేషాచారీ, భరత్‌కుమార్ హెచ్‌ఎంలతో పాటు టిక్యానాయక్ తదితరులు పాల్గొన్నట్లు హెచ్‌ఎం వేణుగోపాల్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పరమేశ్వరస్వామి రథోత్సవం



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరవు మధ్యలో వెలసిన స్వయంభు పరమేశ్వరస్వామి జాతరలో భాగంగా బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో పూజలు, రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవ మూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నం స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారులు కర్పసయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ బంగారుశ్రీను, మాజీఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్ల రామకృష్ణ, పోశన్న, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, యాదమ్మ, తబస్సూం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా స్వామి వారికి మేళతాలాలతో పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి చివరి తేరు సందర్భంగా ప్రత్యేక పూజలు, చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొన్న బైక్ : వ్యక్తికి గాయాలు

మాగనూర్: ఆగి ఉన్న టిప్పర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటన మండలకేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్తల్ మండలం గు డిగండ్లకి చెందిన అంజప్ప(65) కృష్ణ మండలం చేగుంట సమీపంలో గొర్రెల మంద దగ్గరకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో రోడ్డుపక్కన నిలి పి ఉన్న టిప్పర్‌ను వె నుకనుంచి ఢీకొన్నారు. దీంతో ఆ యన కాలు విరగడంతో పాటు గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.